ఇదిగో! ఇదిగో: "అని తన రొంటిలోంచి ఓమత్యాన్ని పైకితీసి "ఇదమ్మితే నీకెంత వస్తుంది సెప్పు గంగాలమ్మా! అరత ఇద్దైపోయేవే ఇదమ్మితే నీకెంతొస్తుంది సెప్పు గంగాలమ్మా!" అని అన్నాడు.

"ఏదీ?" అని గంగాలమ్మ దాన్ని అందిపుచ్చుకొని "తీస్సలమ్మనే అమ్మను దీన్ని!—చూడు సాయేబూ ఈముండని యీలంజని—" అని జీవనంతోవున్న ఆ మత్యాన్ని జనంతో వున్న ఓకసాయి సాయేబు చేతిలో వుంచింది. "నాదెం కట్టిస్నట్టు."

ఆ కసాయిసాయేబు ఆ జీవనంతోవున్న చేపతనని తాకి తన అరచేతిలో తాండవించి పోతూవుంటే తన పెరచేతిలోవున్న మొండికత్తి నేలకు జారేసి అంతమందిలోనూ కొత్త కుతూహలం కాపరిచాడు.

"కొత్లేటిది సేప హిల్లాంటిదీ హవితే
గంగాలమ్మ సూపు హెల్లాంటిదో హల్లా!"

అని అనుకొంటూ తన వొళ్ళంతా ఏదో నవజీవనం, లోకజీవనం, అశోకజీవనం, అశరీరజీవనం, ఏకైకజీవనం పాకిపోతూ వున్నట్టు పరవశించేడు.

.... .... .... .... ....

## రాములూ! ఇంకా ఇంజరంబండి రాలేదూ

"రాములూ! ఇంకా ఇంజరంబండి రాలేదూ" అనే యెలుగు ఆ నిశ్శబ్ద వాతావరణంలో యేకైక మధురమై, స్త్రీ కంఠస్వరమని

చెప్పి అనుకొనేటట్టు వాయు వలయాల మీదుగా పోయిపోయి దిఙ్మండల మార్గాన్ని లయించింది. అది కొండల మధ్యప్రదేశం. "ముస్తాబాద" రైలు స్టేషన్‌కడ రెండు లైనులున్న యెడాన్ని రెండో లైనుమీద కూలీల రైలుబండి విలిచిన తావు. బహుశా యేదో ప్యాసెంజరో మెయిలో పోయేదానికి ఆ కూలీల బండి అక్కడ ఆపుచేసి యుంటారు. ఆ సంగతి ఆ స్త్రీ వ్యక్తికి తెలియదు. ఆమెకు తెలిసిందల్లా తమబండి, తమ యిసకబండి అక్కడప్పటికి సాయంకాలం 5 గంటలనుండి అలా పడేసి యుంచబడిందని మాత్రం తెలుసు. నీళ్ళులేక నిప్పుల్లేక, ఇంజన్ లేక ఈలలేక, ఆమెకు ప్రాణం విసుకు వస్తూవుంది. రాత్రి పది పోతూంది. ఇక పట్టలేక పైకడిగేసింది "రాములూ! ఇంకా ఇంజరంబండి రాలేదూ!" అని తోడిపనిచేసే యొక మగవాణ్ణి.

రాములు ఆమెకేసి చూడకుండానే అన్నాడు.–" ఈ మాపు లిక్కడుండిపోవలసి వచ్చేటట్టుంది మనమంతా – గార్డుదొర ఇంజన్ తీసుకు బెజవాడ దయచేశాడు. మళ్ళీ పొద్దున్నే రావడం!" అన్నాడు. "ఎక్కడో వీల్చూసుకు తొంగో– కూడు తిన్నావా?" అని అడిగాడు.

ఆమె యేమిటంటుంది పాపం!

"అరివీడు నాశనంగాను, మన్నింతమందిని ఇక్కడ చల్లో అఘోరిస్తూవుండమని తాను బెజవాడ–?" అంది. రాములు ఆ స్త్రీ మొఖంకేసి కొంచెం నిదానించి చూచి "యేఁవే! సూరీ! ఇంటికెడితేమాత్రం మనకేంమేడలా? మిద్దెలా? పరుపులా? చెక్కాలా? అక్కడన్నా చల్లో యికిలించుకుంటూ పొర్లడమే కదంటే?—సూడు! ఆ వాగన్‌కింద నాలుగు గడ్డిపరకలు మొల్చి

ఎండికాళ్ళనలుగుణ్ణి మెత్తమెత్తగా వున్నట్టున్నాయి. పైని మంచుపడదు. అక్కడో కునుకు తియ్యి. నేనూ ఆ మధ్యనే నిదరోవాలని చూస్తూవున్నాను — అవితే సూరీ ! మనోళ్ళంతా ఎక్కడకు పోయినారో ? వాళ్ళకు తెలుసాయేమిటి చెప్మా ! ఈ బండిప్పుడు కదల్దని " అన్నాడు.

సూరి రాములుకేసి చూస్తూ " ఇంట సలేసినా సౌఖ్యంగా వుంటుంది రాములూ ! ఇక్కడ సూడు ! సుట్టూ కొండలు. ఎక్కడసూసినా ఆగలపగల అంత మంచేసుకుందామంటే పెంట పోగన్నా వుండదు " అంది.

రాములూ సూరీ పైరీతిని మాట్లాడుకుంటూ వున్నారన్న మాటేగాని అది నిజంగా వినడంఅంటూ వస్తే మనకి సంభాష ణగా వుండదు—నిశ్శబ్దంలో ఎదోధ్వనించి మనహృదయాన్ని కరిగించే కనపడని పక్షుల కలకలారావమ్మాదిరిదో, కోతుల కిచ కిచాలాపంలాంటిదో, సెలయేళ్ళ బిలబిలధ్వానం పోలికదో అని అనుకుంటాం——కాలం మటి రాత్రి తొమ్మిదింటిదాకా అంత నిశ్శబ్దంగానూ గడచిపోయింది. తక్కిన కూలీలు వంద వంద యేభైమంది ఆడ మగ వివక్షతలేకుండా చెట్టోపిట్టయి తిరిగి, కొందఱు ఎండిపోయిన తాటిమట్టలతోను, కొందఱు యేరు పిడకలతోను, కొందఱు కట్టెపుల్లలతోను, కొందఱు సందెడు సందెడు వట్టిగడ్డితోనూవచ్చి, ఆవాళ్ళ, కప్పులేని కాపుదలలేని ఇసకా రాయి పోసే బళ్ళక్రిందా, చక్రాలవారా, పట్టాలే తల గడాలుగా చేసికొని, అడ్డుదిమ్మలే పక్కలకింద దులుపుకొని, విశ్రాంతి గొన్నారు. ఒకడు రెండోవాణ్ణి గురించిగాని, ఒకత్తె రెండోదాన్ని గురించిగాని, ఒకడు ఒకత్తెను గురించిగాని ఒకత్తె

ఒకట్టే గురించిగాని, తలపోతలేమీ లేకుండా గాఢనిద్రలో పడి పోయినారు. రాములు సూరికి సమీపంలోనే పడుకుంటానని ఉండికే అన్నాడే కాని సూరికి సమీపంలో కాదుకదా ఆ చుట్టు పట్లు యెక్కడా పడుకోలేదు. సూరి మొదట రాములు చెప్పిన స్థలంలో పడుకోవాలని అనుకొంది కాని నిజంగా తనకు నిదర ముత్తొచ్చేతలికి ఒక కొండవాగు అంత క్రితం తెగ్గోసుకు ప్రవహించి ఎండిపోయిన గజం వెడల్పుగల ఒక యిసకమేటలో కూర్చున్నట్టే కూర్చుని తనకు తెలీయకుండానే ఒరిగి మేను మఱచి సుషుప్తిని పడింది.

ఆలా విదిరిస్తూ మెదడు వ్యసనం లేనివారి ఉదిరిజీవనాలను చూచి ఉప్పొంగి పోయేభాగ్యం ఒక్క ఆకాశమ్మీది చుక్కలకు తక్క అక్కడ మఱియే జీవరాశికీలేదు. చుక్కలా రాత్రి అత్యుత్తమ కాంతిని ప్రకాశిస్తున్నాయి. ఒకానొక ప్రత్యేకపు తారయొక్క ప్రత్యేకపు కిరణము సూరియొక్క కనుమోడుపు మీద ప్రాముఖ్యత వహించి తేజస్థాయిని నిలకడ పొందిన దనుటలో అతిశయోక్తి యెంతమాత్రమున్నూ కూడా వుండబోదు.

ఒకరైలు ఆగి, మఱి నడవని ఆ నిశ్శబ్దంలో సూరి రాములయొక్క సంభాషణం వింత గొల్పినప్పుడు, సూరీరాములు యెన్నిగువార్ని కూడా నిదరబుచ్చి ప్రకృతి అతిమౌగ్ధ్యము వహించిన సమయాన ఆకాశమ్మీది చుక్కలు జ్ఞానకళ వహించేటప్పుడు మృత్యువు! మృత్యువు! చీకుమృత్యువు! చెవిటి మృత్యువు! ఈ కారణ జన్మకు విరామము కల్పించి విడని వతిలేయగ జేయు మృత్యువు! అట్టి మృత్యువున కావలవినవచ్చు ధ్వని యుండదూ? అట్టి మృత్యువున కావల కనవచ్చు కాంతి యుండదూ? చనిపోదుటన్న మనుటున కంత భీతియేల?

రాత్రి పదునొకండు గంటలైంది సరిగ్గా మద్రాసుపోయే మెయిలు బండి పెద్దలైటుతో గుబుకు గుబుకుమని పట్టాల దిగ్గింపులదిరి పోయ్యేటట్టు వచ్చేస్తూవుంది. ప్లాటుఫారంమీ లైనంటే సూరి అదిరిపాటున లేచి నిదరకళ్ళనే గబగబా మెయి లొచ్చే తాయలకు పరుగెత్తుకుంటూ పోతూ ఒకతట్టు మెయిలుకు "ముస్తాబాదా" స్టేషన్ మాస్టరు లైనుక్లియరు అందిస్తూవుంటే, రెండోతట్టు మెయిలుబళ్ళయొక్క తలుపుల పక్క కమ్మీల్లో ఒక కమ్మీకి తన గాజుల చేయితగిల్చింది. తగిల్చిందా? లేదు పాపం! సూరిపట్టు ఎక్కడ? మెయిలు వేగం ఎక్కడ? సూరి యీడిగలపడ్డట్టు మెయిలుక్రింద పడిపోయి తుక్కు తుక్కయి పోయి కాలంచేసింది. ఆ చీకటి రాత్రి అదే ఏ ధున్నపోతైనా, యే యేనుగైనా, యే పెద్దమూనైనా, అయితే డ్రైవరుగాని గార్డు గాని తెలిసికొని యుండి యుందురేమో? మనిషి, అందులోనూ నిదరమత్తున తేలిపోతూ పరుగెత్తుకు వచ్చిన పడుచుకుర్రది రైల్భక్రిందపడి నలిగి నలిగి చనిపోయింది అంటే ఎవరికి తెలు స్తుంది. ఆ అపరాత్రి ఎవరికీ తెలియలేదు. యే చుక్కలు ఆమె కనుమొగుడ్పులమీద కళ వహించినవో ఆ చుక్కలే ఆమె వెచ్చని నెత్తురు చిమ్మల్ని మంచు బిందువులచే కడిగి యొకింత శాంతిని తాముపొంది యొకింత శాంతి నామె కందిచ్చినవి. ఆమెలో తెల్లవారకముందే భౌతికకళ నశించింది. ఆమెపోయినా గానీ ఆమె ఎత్తిన ఆనాటి అసుర సంజలోని యెలుగు "రాములూ! ఇంకా ఇంజరంబండి రాలేదూ" అన్న ఆ యెలుగు మాత్రం ఆ నిశ్శబ్ద వాతావరణంలో యేకైక మధురమైన స్త్రీ యొక్క కంఠ స్వరమని చెప్పి అనుకొనేటట్టు వాయువలయాలమీద ఇంకా పోతూ పోతూ దిఙ్మండలాన్నిఅయిస్తూనేవుంది.

సూరితల్లి ఉదయమయ్యేసరికి గన్నారంనుంచి వచ్చి చూచి గోడు గోడున యేడుస్తూ "మెయిలెక్కే భాగ్యమే కనక మనకుంటే ఇలా యిసకా రాయీ ఎందుకు మోస్తాంతల్లీ; మెయి లెప్పుడైనా ఎక్కావా? దాని కమ్ముకొట్టుకోవడానికి?" అని అంగలార్చింది. సూరి మగడు పెదవడ్లపూడినుంచి వచ్చి భార్య కళేబరమ్మీదపడి "నా కోసమని మెయిలుమీద అతి తొందఱగా రావాలను కొన్నావుచే" అని వెక్కి వెక్కి విలపించేడు.

రాములు ఉదయించే సూర్యభగవానుని చూస్తూ "సూరి అకాలమృత్యువు ఆ విధంగా పొందడానికి కారణమేమిటంటావు?" అని పై వాళ్ళ ఏడుపు వినలేక, సూరి మొండెంతుండు కనలేక కళ్లు మూసుకొన్నాడు. తక్కినవాళ్లు అంతా ఎవరికి తోచినట్లు వాళ్లు చనిపోయిన సూరియొక్క గుణగణాన్ని అగ్గిస్తూ వగచేరు.

నిజంగా సూరిమృత్యువను గుఱించి అంత అనుకోవలసిన జరుగురులేదు. నడుస్తువున్న మెయిలు ఎక్కబోయి పట్టుతప్పి పడి చచ్చింది అని ఒక్కమాటతో పంచాయితీదార్లు వ్రానేశారు. మఱచిపొయ్యేరు కాని ఆ కూలి జనులకుమాత్రం దాని అలాటి అకాలమృత్యువు తగని సమస్యగా ఏనాటికి తెగని జిజ్ఞాసగా విలయదారుణంగా వుండి పోయింది.

పగలల్లా సూరి యిసకపోసిన రాయి పఱచిన ఆ దారే రాత్రివేళ దాని చావుకు కారణమైందే" అని ఆశ్చర్యపోతూం టారు. "రాములూ ఇంకా ఇంజరంబండి రాలేదూ" అని అను కొన్నది, దాని ప్రాణానికి మెయిలు ఇంజను అవుతుందని ఎవరికి తెలుసూ? పాపం!

.... .... .... .... ....